జీఐఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలి

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీల జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా మంగళవారం క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేకు నగర వాసులు సహకరించాలని జీహెచ్ఎంసీ కోరింది. ఉప్పల్, హయత్‌నగర్, హైదర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, చందానగర్‌లో నిర్వహిస్తున్న ఈ సర్వేలో భాగంగా సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

అదనపు కమిషనర్ల బదిలీలు!

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా పుర పాలక శాఖలో జరుగుతున్న బదిలీలలో జీహెచ్ఎంసీకి సంబంధించి పలువురు అదనపు కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు పుర పాలక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జె.సువార్త కరీంనగర్ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. సంధ్య సిద్దిపేట మున్సిపాలిటీ, వి.ప్రశాంతికి సీడీఎంఏకు, డి.ధాకు నాయక్ పాల్వంచ మున్సిపాలిటీకి, ఏ.నాగమణి దమ్మాయిగూడ మున్సిపాలిటీ, టి.దశరథ్‌కు గద్వాల్‌కు, బి.రాజేశ్ కుమార్ బైంసాకు, ఏ.విజయలక్ష్మి వరంగల్ మెప్మాకు, సీహెచ్ జోత్స్న సీడీఎంఏకు బదిలీ అయ్యారు. నాగేందర్ చేర్యాల మున్సిపాలిటీ, ఆర్.పుష్పలత నల్గొండ మున్సిపాలిటీలకు, పి.శ్రీధర్, సీఎన్ రఘు ప్రసాద్, ఎన్.సామ్రాట్ అశోక్‌కు జీహెచ్ఎంసీకి బదిలీపై వచ్చారు. సీహెచ్ రాజేందర్ రెడ్డి బదిలీపై గ్రేటర్‌కు వరంగల్‌కు, వెయింటింగ్‌లో ఉన్న అరుణ కుమారి, డి.శంకర్ సింగ్ గద్వాల్ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీపై వచ్చారు.

పాత బస్తీ మెట్రో పొడిగింపు

7.5 కి.మీతో కొత్త డీపీఆర్ రెడీ

రూ.2300 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్ నిర్మాణం



సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): పాత నగరం మెట్రో అలైన్‌మెంట్ మారింది. మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా ఫలక్‌నుమా వరకు నిర్మించాల్సిన మెట్రో కారిడార్‌ను తాజాగా చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇప్పటి వరకు 5.5 కి.మీ మేర నిర్మించాల్సిన ఉన్న పాత నగరం మెట్రో మార్గాన్ని మరో 2 కి.మీ దూరం పొడిగిస్తూ కొత్త డీపీఆర్‌ను రూపొందించారు. మొత్తం 7.5 కి.మీ దూరంతో నిర్మించే పాత నగరం మెట్రో కారిడార్ నిర్మాణానికి రూ.2300 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో చేపట్టనున్న మెట్రో మార్గాల్లో పాత నగరం మెట్రో, నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించే మెట్రో మార్గాలకే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ పాత నగరం మెట్రో కారిడార్‌కు రూ.500 కోట్లు, ఎయిర్‌పోర్టు మెట్రోకు రూ.100 కోట్లను కేటాయించారు. ఈ రెండు కారిడార్లు ఇన్నర్ రింగు రోడ్డుపై చాంద్రాయణగుట్ట వద్ద అనుసంధానం అవుతుండటంతో అక్కడ ఇంటర్‌ఛేంజ్ మెట్రో స్టేషన్‌ను నిర్మించేలా డీపీఆర్‌ను రూపొందించారు. చాలా ఏండ్లుగా పెండింగులో ఉన్న పాత నగరం మెట్రో మార్గాన్ని ఇతర కారిడార్లతో సంబంధం లేకుండా పూర్తి చేయాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగానే ఎంజీబీఎస్ -చాంద్రాయణగుట్ట మెట్రో మార్గాన్ని కారిడార్-4గా నిర్ణయించి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అందజేసేందుకు సిద్ధంగా ఉంది.

ఆస్తుల సేకరణకే రూ.వెయ్యి కోట్లు...

పాత నగరంలో నిర్మించే 7.5 కి.మీ మెట్రో కారిడార్‌లో భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోందని మెట్రో అధికారి తెలిపారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో సుమారు 1100లకు పైగా ఆస్తులు ఉన్నాయని, వాటన్నింటినీ గుర్తించి పరిహారాన్ని చెల్లించాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యయంలో సగం ఆస్తుల సేకరణకే వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాత నగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించే రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండటంతో ఆ మార్గాన్ని 60 నుంచి 80 అడుగుల మేర విస్తరించాలంటే ఆస్తుల సేకరణ ఎక్కువ మొత్తంలో చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ఈ మార్గంలో యుటిలిటీస్ (విద్యుత్ స్తంభాలు, మంచినీటి లైన్లు, డ్రైనేజీ లైన్స్, కేబుల్స్)ను మరో చోటుకు తరలించాల్సి ఉంటుంది. ఇందుకు సుమారు రూ.200 కోట్లు వ్యయం అవుతుందని మెట్రో అధికారి తెలిపారు. వీటికి తోడు మతపరమైన కట్టడాలు సైతం 100కు పైగా ఉండటంతో వీటికి ఎలాంటి ఆటంకం కలకుండా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండటంతో చాలా సమయం తీసుకుంటుంది. అన్ని అడ్డంకులు దాటుకొని పాత నగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించాలంటే సుమారు రెండు నుంచి మూడేండ్లు పడుతుందనే అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): డిస్కం పరిధిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు క్షేత్ర స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు సబ్ స్టేషన్‌లను మంగళవారం పరిశీలించారు. విద్యుత్ సరఫరా తీరు తెన్నులను, ఫీడర్ సర్వే అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం, శంషాబాద్ పట్టణ శివారులోని ధర్మసాయి సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన ఐదు ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సీఎండీ ప్రారంభించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పి.ఆనంద్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎల్.గోపయ్య, డీఈ రత్నాకర్‌లతో పాటు ఎలక్ట్రికల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

వరల్డ్ హెరిటేజ్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ పర్యాటక స్టాల్

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): ఢిల్లీలో జరుగుతున్న 46వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ ఇండియా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన టూరిజం శాఖ స్టాల్‌ను రాజ్యసభ సభ్యులు సుధామూర్తి సందర్శించారు. హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్, పర్యాటక ప్రదేశాల సమాచారం తెలుసుకున్నారు. మినీ ఇండియాగా పేరొందిన హైదరాబాద్, విభిన్న పర్యాటక కేంద్రాలతో దేశ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకుంటుందని హైదరాబాద్ టూరిజం డీటీఓ ఎస్.ప్రభాకర్ ఆమెకు వివరించారు. కాగా, ఈ ఎగ్జిబిషన్ బుధవారంతో ముగియనుంది. టీజీ టీడీసీ ఏఎం సాయిరామ్, ఓఎస్‌డీ నితిన్, రామకృష్ణ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్ష బరిలో 'వల్లకాటి' నామినేషన్

నామినేషన్ పత్రాలను ఎన్నికల కమిటీ సభ్యులకు సమర్పిస్తున్న వల్లకాటి రాజ్ కుమార్

కాప్రా, జూలై 30: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, రాష్ట్ర పద్మశాలి సంఘం కోశాధికారి వల్లకాటి రాజ్‌కుమార్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు నగరంలోని ఎల్‌పీటీ మార్కెట్‌లో పద్మశాలి సంఘం ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ ప్రతినిధులకు రాజ్ కుమార్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకు ముందు నగరంలోని కర్నాటి గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించి, భారీ ర్యాలీతో ఎల్‌పీటీ మార్కెట్‌కు రాజ్ కుమార్ మద్దతుదారులు తరలివెళ్లారు. ఆగస్టు 18న ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సభ్యులు బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌లో పాల్గొని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పద్మశాలీయుల ఐక్యత, ఔన్నత్యాన్ని కాపాడటంతో పాటు బలమైన సంఘాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పద్మశాలీల సంక్షేమానికి పాటుపడ్తానని అధ్యక్ష పదవికి పోటీ పడ్తున్న రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలు, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అవకాశం

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలను అందిస్తున్నదని హైదరాబాద్‌లోని బీడీ కార్మిక సంక్షేమ నిధి వైద్యశాల అధికారిణి డాక్టర్ స్వర్ణలత తెలిపారు. కేంద్ర కార్మిక శాఖ అందించే ఈ ప్రయోజనం కోసం ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్, డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు అక్టోబర్ 31లోపు scholarships.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కాలర్‌షిప్ ప్రయోజనాలను పొందేలా ప్రతి ఒక్కరి బీడీ కార్మికుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెల్ప్ లైన్ నంబర్లకు 0120-6619540, 040-29561297 కాల్ చేసి డాక్టర్ స్వర్ణలత వివరించారు.

ఎయిర్‌పోర్టులో ధర్నాకు దిగిన క్యాబ్ డ్రైవర్లు

పారుగు రాష్ట్రాల వాహనాలను అనుమతించొద్దు

ఓలా, ఉబెర్ సంస్థల తీరుపై డ్రైవర్ల ఆగ్రహం

ఎయిర్‌పోర్టులో ధర్నాకు దిగిన డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, జూలై 30: ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లకు అనుమతి ఇవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఓలా, ఉబెర్ క్యాబ్ డ్రైవర్లు మంగళవారం మధ్యాహ్నం నుంచి ఎయిర్‌పోర్టులో 2000 మంది ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లకు ఎయిర్‌పోర్టులోకి అనుమతి ఇవ్వడంతో తమకు కనీసం రోజు వారీగా గిట్టుబాటు కావడం లేదంటున్నారు. కార్లు కోనుగోలు చేసుకున్న మాకు ఈఎంఐలు చెల్లించడానికి డబ్బులు లేకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొన్నట్లు వారు వివరించారు. కొంత కాలం నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ముంబైతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను ఎయిర్‌పోర్టులోకి అనుమతి ఇవ్వడంతో మాకు గిరాకీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఓలా, ఉబెర్ కంపెనీల యాజమాన్యం దిగి వచ్చి ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలను నిలిపివేస్తామని హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించమని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు ఆందోళన విరమించాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కల్గించ వద్దన్నారు.

గ్రేటర్‌లో చెత్త కనబడకుండా చర్యలు

జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో ఎక్కడ కూడా చెత్త కనబడకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. కమిషనర్ అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. శానిటేషన్, స్వచ్ఛ ఆటో హాజరు శాతం మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. సహాయ వైద్యాధికారులతో పాటుగా సంబంధిత డిప్యూటీ కమిషనర్లు నిర్దేశించిన సమయంలో ఉదయం పూట తప్పని సరిగా విధులకు హాజరు కావాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త, గ్రీన్ వెస్ట్ (సీ అండ్ డీ) భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాల్సిన బాధ్యత డీసీలు, సహాయ వైద్యాధికారులేనని కమిషనర్ పేర్కొన్నారు. జోనల్ కమిషనర్లు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. సీఆర్ఎంపీ రోడ్లపైన పాట్ హోల్స్, రోడ్డు మరమ్మతులు, రోడ్డుపై మార్కింగ్ లైనింగ్, ఫుట్‌పాత్ మీడియంలో గ్యాప్ లేకుండా మొక్కలు నాటాలని కమిషనర్ ఆదేశించారు.

జల మండలి బదిలీల్లో నిబంధనలకు పాతర!

ముఖం చూసి బొట్టు పెడుతున్నారంటూ కార్మికుల మండిపాటు

ట్రాన్స్‌ఫర్స్ సక్రమంగా జరపకపోతే ఆందోళన చేస్తాం: గుర్తింపు సంఘం నేత

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): జల మండలిలో కార్మికులు, ఉద్యోగుల సాధారణ బదిలీలలో పారదర్శకతకు పాతర వేశారా? పరిచయం, 'చే'యి తడిపిన వారిని అనుకూలమైన చోట, లేని వారిని సంబంధం లేని చోటకు బదిలీ చేస్తున్నారా? కాంగ్రెస్ యూనియన్ చేతిలో అధికారులు కీలు బొమ్మలుగా మారారా? అంటే కార్మిక వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. వాస్తవంగా ఉద్యోగులకో లెక్క కార్మికులకో రీతిన ఇష్టారాజ్యంగా బదిలీలు జరుపుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. బదిలీ ప్రక్రియలో ముఖం చూసి బొట్టు పెట్టే పద్ధతిలో బదిలీలు జరుగుతున్నాయని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ (గుర్తింపు సంఘం) అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ ఆరోపించారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎండీ, ఉన్నతాధికారులు ముందస్తుగా చెప్పారని, కాని, క్షేత్రస్థాయిలో కొంత మంది నాయకులు, అధికారులకు నచ్చిన వారిని కోరుకున్న స్థానంలో బదిలీ చేశారని మండిపడ్డారు. మిగిలిన ఉద్యోగుల విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని, కక్షపూరితంగా బదిలీలు జరుగుతున్నాయని విమర్శించారు. బదిలీలో భాగంగా 40 శాతం మంది మాత్రమే బదిలీలు ఉన్నాయని, ఈ నిబంధన పాటించలేదని ఆరోపించారు. మహిళలకు ట్రాన్స్‌ఫర్ లేనప్పటికీ వారిని బదిలీ చేశారని రాంబాబు యాదవ్ తెలిపారు. జరుగుతున్న బదిలీలలో లోపాలను ఎత్తిచూపుతామని, వీటన్నింటికీ వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాటం చేస్తామని రాంబాబు యాదవ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే కృషి

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

మాదాపూర్, జూలై 30: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే పని చేస్తున్నదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. మియాపూర్‌లోని హోటల్ అశోక గ్రాండ్‌లో మంగళవారం యూనియన్ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో విలేకరుల సమస్యలపై తరుచు సమావేశాలు, చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. సకాలంలో సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు జర్నలిస్టులు ప్రాణాలను కోల్పోయారన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి విలేకరికి అక్రిడిటేషన్ అందాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి మండల జిల్లా కేంద్రాలుగా పరిగణనలోకి తీసుకుంటూ ఇండ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం, కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్ సలీంలు మాట్లాడారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులను శేరిలింగంపల్లి యూనియన్ జర్నలిస్టులు సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డితో పాటు కోశాధికారి వెంకట్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, శంకర్ శిగా బాలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కిషన్, సత్యనారాయణ, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస రావు, నాగేందర్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు గౌడ్, కార్యవర్గ సభ్యులు దారుగుపల్లి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు కొండా విజయ్ కుమార్ ఉన్నారు.

డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల ఎంపిక షురూ

ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టరేట్‌లో ఇండ్లు కేటాయించాలంటూ గృహ నిర్మాణ శాఖకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్న దరిమిలా డబుల్ బెడ్ రూం పరిస్థితిపై ఆరా తీశారు. అందులో భాగంగా మంగళవారం ఎల్బీనగర్‌లోని బాకారం, ముషీరాబాద్‌లోని కవాడిగూడలో డబుల్ బెడ్ రూం గృహ సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మరో వారం రోజుల్లో ప్రారంభోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు గృహాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్ సింగ్, హౌసింగ్ డీఈ గంగాధర్, తహసీల్దార్ రాణా ప్రతాప్ సింగ్, ఏఈ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

పెట్ల బురుజు ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి

సుస్తీ దవాఖాన

(మొదటిపేజీ తరువాయి)

ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌కు తప్పని నిరీక్షణ..

టెక్నీషియన్స్ సిబ్బంది బదిలీ కారణంగా సీటీస్కాన్, ఎంఆర్ఐ కోసం రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. సిబ్బంది కొరత కారణంగా ఎంఆర్ఐ, సీటీ స్కాన్ కోసం వచ్చే రోగులకు కనీసం వారం నుంచి నెల రోజుల వరకు నిరీక్షణ తేదీని ఇస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. ఖరీదైన ఎంఆర్ఐ, సీటీస్కాన్‌లను బయట చేయించుకునే స్థోమత లేక పోవడంతో రోగులు వాటికోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ నివేదికల ఆధారంగానే చికిత్స చేయాల్సి ఉండటంతో రోగులకు చికిత్సలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ల్యాబ్‌లో తప్పని తిప్పలు

డయాగ్నోస్టిక్ కేంద్రంలో 8మంది సిబ్బంది ఉండగా వారిలో ఐదుమంది బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు రాలేదు. దీంతో ముగ్గురు మాత్రమే నమూనాలు సేకరిస్తుండటంతో వారిపై తీవ్ర పనిభారం పడటమే కాకుండా రోగులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు.

ఉస్మానియాలో ప్రొఫెసర్ల సీట్లు ఖాళీ..

ఉస్మానియా దవాఖానలో సుమారు 60 మంది ప్రొఫెసర్లు బదిలీ కాగా వారి స్థానంలో ఇప్పటి వరకు కేవలం ఒక్కరు మాత్రమే చేరారు. దీంతో 59మంది ప్రొఫెసర్ల సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్లు లేకపోవడంతో వైద్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారితో పాటు రోగులకు మెరుగైన చికిత్స కరువైంది. విభాగాలన్నింటికి అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులే దిక్కయ్యారు. ఏ విభాగంలో చూసినా అసోసియేట్‌ల పర్యవేక్షణలో పీజీలే వైద్యసేవలు అందిస్తుండటం కనిపిస్తోంది. డెర్మటాలజీ విభాగంలో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లు బదిలీ ఖాగా వారి స్థానంలో కొత్తవారు రాలేదు. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో పీజీలే వైద్యసేవలు అందిస్తున్నారు. ఆర్థో విభాగంలో నలుగురు ప్రొఫెసర్లు ఉండగా వారిలో ముగ్గురు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారు రాకపోవడంతో ఆర్థో సర్జరీలను వాయిదా వేస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. మిగిలిన చాలా విభాగాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు.

నిలోఫర్‌లో గర్భిణులు, చిన్నారులకు ఇబ్బందులు..

చిన్నపిల్లల ప్రత్యేక దవాఖానగా పేరుగాంచిన నిలోఫర్‌లో చిన్నారులు, గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైద్య శాఖలో జరిగిన బదిలీలతో పలు విభాగాలను అసోసియేట్‌లు, పీజీ విద్యార్థులే చూసుకుంటున్నారు. నిలోఫర్‌లో మొత్తం 12యూనిట్లకు గాను ఒకేసారి 9మంది ప్రొఫెసర్లు బదిలీ కాగా కేవలం ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఇతర దవాఖానల నుంచి బదిలీపై నిలోఫర్‌కు వచ్చారు. దీంతో ప్రస్తుతం నిలోఫర్‌లో ఉన్న 12యూనిట్లకు 12మంది ప్రొఫెసర్లు ఉండాలి. కానీ, కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. దీంతో మిగిలిన యూనిట్ల పరిస్థితి కొత్త డాక్టర్లు వచ్చే వరకు ప్రశ్నార్థకమే. ఇదిలా ఉండగా పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేకపోవడంతో సరైన పర్యవేక్షణ లేక కిందిస్థాయిలోని ఆయా విభాగాల్లో సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. ఆర్ఎంఓలు లేకపోవడంతో సంబంధిత విభాగాలు అయోమయంగా మారాయి.

జూడాలు, పీజీలే వైద్య సేవలలో కీలకం....

మంగళవారం నీలోఫర్ దవఖానలో ఓపీ వద్ద రోగులు బారులు తీరి కనిపించారు. మొన్నటి వరకు క్యూ లైన్‌లో నిలబడ్డాల్సిన అవసరం లేకుండా సాంకేతికతను అందిపుచ్చుకున్న నీలోఫర్ దవాఖాన క్యూ ఆర్ కోడ్ యాప్ ద్వారా స్కాన్ చేసుకుని రిజిస్ట్రేషన్ పొందే పద్ధతిని ప్రవేశపెట్టింది. కానీ కొందరికి మొబైల్ ఫోన్ లేకపోగా ఉన్నవారు కూడా ఆ విధానం అర్థంకాక ఆందోళనకు గురవుతున్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలతో జూనియర్ డాక్టర్ల, పీజీ విద్యార్థులే రోగులకు వైద్య సేవలు అందిస్తూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోగులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదని గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల స్థానంలో ప్రస్తుతం 8మంది మాత్రమే ఉన్నారు. ముఖ్యంగా రేడియాలజీ విభాగంలో ఉన్న ఒక్క ప్రొఫెసర్ వికారాబాద్‌కు బదిలీకాగా ఆ స్థానంలో కొత్తవారు రాలేదు. దీంతో స్కానింగ్, ఎక్స్‌రే, సీటీ స్కానింగ్‌ల కోసం రోజుల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. వారం నుంచి 15 రోజుల వరకు అపాయింట్‌మెంట్ డేట్‌లు ఇస్తున్నట్లు రోగులు వాపోతున్నారు.

ఆ మందులు బయట కొనండి..

చిన్నారులు, గర్భిణులకు, గైనిక్ సంబంధిత సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా అందించే మందులు సైతం పూర్తి స్థాయిలో లేవని, బయట నుంచి తెచ్చుకోవాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. నాలుగు రకాల గోళీలు రాసిస్తే అందులో రెండు, మూడు మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన వాటిని బయటి నుంచి కొనుగోలు చేయాలని చెబుతున్నట్లు రోగులు తెలిపారు. కాగా సరోజిని కంటి దవాఖానలో సైతం మందుల కొరత కారణంగా కొన్ని రకాల మందులను బయటి నుంచి తెచ్చుకోవాలని సూచిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు.

వనస్థలిపురం ఏరియా దవాఖానలో..

వనస్థలిపురం ఏరియా దవాఖానలో గతంలో వెయ్యి నుంచి 13వందల ఓపీ ఉండేది. ఇప్పుడు 6నుంచి 7 వందలుగా ఉంటోంది. ఫార్మసీలో అన్నిరకాల మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు రాసిన మందులు సగం మాత్రమే ఇస్తున్నారని, మిగతావి బయట తీసుకోవాలని చీటీలో రౌండప్ చేసి మరీ సూచిస్తున్నట్లు రోగులు చెబుతున్నారు.

చీటీల కోసం గంట నిరీక్షించాల్సిందే..

మల్కాజిగిరి జిల్లా దవాఖానలో చీటీల కోసం రోగులకు